ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 5-3-2025 సమయం 1810 గంటలు

<u>ముఖ్యాంశాలు</u>

1. నాగర్ కర్నూల్ జిల్లాలోని దోమలపెంటలో పాక్షికంగా కూలిపోయిన SLBC సొరంగం లోపల శిథిలాల తొలగింపు శర వేగంగా కొనసాగుతోంది.

2. సోన్ ప్రయాగ్- కేదార్ నాథ్ మధ్య 12.9 కిలోమీటర్ల పొడవైన రోప్ వే నిర్మించడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

3. తెలంగాణలో నిర్మాణమయ్యే ప్రాజెక్టుల పట్ల తమకు అభ్యంతరం లేదని కేంద్రానికి లేఖ రాసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కోరారు.

4. రాష్ట్రంలో 2025 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి.

<u>LEAD SLBC:</u>

నాగర్ కర్నూల్ జిల్లాలోని దోమలపెంటలో పాక్షికంగా కూలిపోయిన SLBC సొరంగం లోపల శిథిలాల తొలగింపు శర వేగంగా కొనసాగుతోంది. లోహపు ముక్కలను తొలగించడంతో ఈరోజు పనులు వేగం పుంజుకుంది. రెండు ఎక్స్కవేటర్లను ఉపయోగించి శిథిలాలను లోకోమోటివ్‌లోకి లోడ్ చేశారు. లోహపు ముక్కలు, రాళ్ళు, బురదతో సహా భారీ మొత్తంలో పేరుకుపోయిన శిథిలాలను తొలగించి చిక్కుకున్న 8 మంది కార్మికుల ఆచూకా కోసం రెస్క్యూ బృందాలు క్రమపద్ధతిలో పని చేస్తున్నాయి. సొరంగం ముఖద్వారం నుండి 10 కిలోమీటర్ల వరకు కన్వేయర్ బెల్ట్ పనిచేస్తుందని, రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. భారత సైన్యం,

బహుళ సంస్థల సమన్వయంతో ఈ కృషి కొనసాగుతోందని రక్షణ శాఖ ప్రతినిధి ఈ మధ్యాహ్నం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

## SLBC

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ SLBC సొరంగంలో సహాయక చర్యలను సమీక్షించేందుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ ఉన్నతాధికారులతో ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సహాయక బృందాలు కొనసాగిస్తున్న పనులను విభాగాల వారీగా విశ్లేషించారు. సరిహద్దు రహదారి సంస్థ అధికారి కల్నల్ పరీక్షిత్ మెహర టన్నెల్ బోరింగ్ మెషిన్ నమూనాతో అధికారులకు సొరంగం లోపల కొనసాగుతున్న సహాయక చర్యల గురించి వివరించారు.

## CABINET- BRIEFING

సోన్ ప్రయాగ్- కేదార్ నాథ్ మధ్య 12.9 కిలోమీటర్ల పొడవైన రోప్ వే నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త ఢిల్లీలో ఈరోజు సమాచార ప్రసార శాఖమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ రోప్ వే యాత్రికుల ప్రయాణ సమయాన్ని 8-9 గంటల నుంచి 36 నిమిషాలకు తగ్గిస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలియజేశారు. ఈ రోప్ వే దివ్యాంగులకు, అత్యవసరంలో ఉన్న వారికి దోహదపడుతుందన్నారు. హేమకుండ్ రోప్ వే ను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

సౌండ్ బైట్ ... వైష్ణవ్

కాగా, ఈ ప్రాజెక్టుకు మొత్తం 2 వేల 730 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు. పశువుల ఆరోగ్య రక్షణకు వ్యాధి నివారణకు 3 వేల 880 కోట్ల రూపాయలు ఆమెదించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

ఎమ్మెల్యే హరీష్ రావు

తెలంగాణలో నిర్మాణమయ్యే ప్రాజెక్టుల పట్ల తమకు అభ్యంతరం లేదని కేంద్రానికి లేఖ రాసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ చిత్తశుద్దిని నిరూపించుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఈరోజు సిద్దిపేట జిల్లా కేంద్రంలో హరీష్ రావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... సముద్రంలో కలిసే నీటినే తీసుకెళ్తున్నామని చంద్రబాబు సత్య దూరమైన మాటలు చెబుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, కేంద్ర ప్రభుత్వ కక్ష్య పూరిత దోరణి వల్ల రాష్ట్రానికీ అన్యాయం జరుగుతోందన్నారు. చంద్రబాబు సమన్యాయం మాటల్లో తప్ప చేతల్లో లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ను ఆపే ప్రయత్నం చేయలేదని అంటూ అబద్దాలు చెప్పారని, దాన్ని గతంలో ఆయన వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖ రాశారని ఈ సందర్భంగా హరీష్ రావు గుర్తు చేశారు.

పిటిసి, సిద్దిపేట

PM

మౌలిక సదుపాయాలు, పరిశ్రమలలో పెట్టుబడులకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అంతే ప్రాధాన్యాన్ని ప్రజలు, ఆర్థిక వ్యవస్థ, నవ కల్పనలకు కూడా ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు ఉపాధి పై నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్ లో నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ... విద్య, నైపుణ్యం, ఆరోగ్య భద్రత అనే మూడు అంశాలపై ప్రజల పెట్టుబడి దృష్టి ఉందని అన్నారు. కొన్ని దశాబ్దాల తర్వాత విద్యా వ్యవస్థలో చోటు చేసుకున్న నిర్మాణాత్మకమైన మార్పులను ఈనాటి ప్రజలు చూస్తున్నారని నరేంద్రమోదీ అన్నారు. అలాగే టెలి మెడిసిన్ సదుపాయాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు విస్తరిస్తున్నాయని తెలిపారు.

## బ్రేక్

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. ఆకాశవాణి వార్తల కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ని సబ్ స్క్రైబ్ చేయండి.

## ములుగు జిల్లా

ములుగు జిల్లాలో ఎస్ అండ్ టి సిరి వాలంటరి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయంలో మేదరి వర్గానికి చేతి వృత్తులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంబూ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం లభించే విధంగా వస్తువులు తయారు చేయడంపై మధ్యప్రదేశ్ కు చెందిన ఇద్దరు ట్రయినర్లతో 30 మందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ పాల్గొని చేతివృత్తుల ద్వారా చేసే వస్తువులకు మార్కెట్ లో మంచి ఆదరణ ఉందని, దీనిని మేదర్లు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన ఆకాశవాణి ద్వారా తెలియజేశారు.

## INTER EXAMS

రాష్ట్రంలో 2025 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి సంవత్సర ద్వితీయ భాష పేపర్-1 పరీక్ష జరిగింది. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల లోకి ఆలస్యంగా ప్రవేశించడానికి ఐదు నిమిషాల లోపు అదనపు సమయాన్ని అనుమతించినట్లు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. పరీక్షలు సజావుగా జరగడానికి 1,532 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కూడా బోర్డు తెలిపింది. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా గుర్తించడానికి ఈసారి హాల్ టికెట్లో పరీక్షా కేంద్రం స్థానాన్ని తెలిపే క్యూఆర్ కోడ్ ని కూడా పొందుపరిచారు. కాగా రేపు ద్వితీయ సంవత్సరం భాష పేపర్ -II పరీక్షను నిర్వహిస్తారు.

## పన్ను బకాయిదారులకు నోటీసులు

**మంచిర్యాల కార్పొరేషన్ లో పేరుకు పోయిన ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు అందజేస్తున్నట్లు కమిషనర్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్ నోటీసులు అందిన మూడు రోజుల లోపు పన్ను చెల్లించని పక్షంలో ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.**

**సౌండ్ బైట్ .... మున్సిపల్ కమిషనర్**

**పిటిసి, మంచిర్యాల**

## CRICKET

**ICC చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా లాహోర్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. ముందుగా టాస్ గెలిచి న్యూజిలాండ్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్లో గెలిచిన జట్టు ఆదివారం దుబాయ్ వేదికగా జరగే ఫైనల్ మ్యాచ్లో టీమిండియాతో తలపడుతుంది. కడపటి వార్తలందే సమయానికి 48 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 343 పరుగులు చేసింది. ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్ లపై విజయాలు సాధించిన దక్షిణాఫ్రికా గ్రూప్ బి లో అగ్రస్థానంలో నిలవగా, న్యూజీలాండ్ జట్టు పాకిస్తాన్, బంగ్లాదేశ్ లపై గెలిచి, భారత్ చేతిలో ఓడిపోయింది.**

## WEATHER:

**తెలంగాణలో పొడి వాతావరణం ఉండే అవకాశం ఉంది. రాబోయే 3 రోజుల్లో వివిధ ప్రాంతాల్లో ఉదయం వేళల్లో పొగమంచు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, రాబోయే 2 రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలలో మార్పు ఉండదని వాతావరణ శాఖ కార్యాలయం తెలిపింది. 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని తెలియజేశారు.**

జగిత్యాల జిల్లా

జగిత్యాల జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు. కాగా, మంచిర్యాల జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని ఇంటర్ బోర్డు అధికారి అంజయ్య ఆకాశవాణికి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటి పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

పిటిసి, జగిత్యాల, మంచిర్యాల

ఎండ్ ...

ఆకాశవాణి ప్రాంతీయ ఇంతటితో సమాప్తం. తిరిగి 7 గంటల 5 నిమిషాలకు జాతీయ వార్తలు వింటారు.